ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755

- 23 నుంచి సమ్మెలోకి..
- డీఆర్వో, డీఎంహెచ్‌వోకు నోటీసు అందజేత

ఇప్పుడు 108 ఉద్యోగుల వంతు



డీఆర్వో రాజశేఖర్‌కు సమ్మె నోటీసు అందిస్తున్న 108 ఉద్యోగులు

చిత్తూరు రూరల్, జనవరి 10: జగన్ అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్లు అవుతున్నా హామీలు నెరవేర్చకపోవడంతో వివిధ వర్గాల వారు ఆందోళన బాట పట్టారు. అంగన్వాడీలు, సర్వశిక్షా అభియాన్, మున్సిపల్ పారిశుధ్య కార్మికులు ఇప్పటికే సమ్మె చేస్తున్నారు. వారి బాటలోనే అత్యవసర సేవల విభాగానికి చెందిన 108, 104 ఉద్యోగులు ఈనెల 23 నుంచి సమ్మెలోకి వెళ్లాలని నిర్ణయించారు. 23వ తేది లోపు తమ సమస్యలు పరిష్కారం కాకుంటే సమ్మె చేపడతామని 108 ఉద్యోగుల యూనియన్ నాయకులు డీఆర్వో రాజశేఖర్‌కు, డీఎంహెచ్‌వో ప్రభావతిదేవికి, 108 డీఎం మోహన్‌బాబుకు నోటీసులు అందజేశారు.

ఇవీ డిమాండ్లు

- వైద్య ఆరోగ్య శాఖలో డీఎంఈ ద్వారా నోటిఫికేషన్‌తో భర్తీ చేస్తున్న ఈఎంటి పోస్టుల్లో 108లోని ఈఎంటిలను కాంట్రాక్ట్ పద్ధతిపై(సీనియారిటీ, అర్హత, రోస్టర్ పద్ధతిలో) నియమిస్తూ ప్రాధాన్యం కల్పించాలి.
- 108లోని పైలట్లకు ఆర్టీసీ, ప్రభుత్వ ఏ ఇతర శాఖల్లోనైనా డ్రైవర్ పోస్టుల్లో నియమించాలి.
- ప్రస్తుత వేతనాలపై 108 అంబులెన్స్‌లో పనిచేస్తున్న ఈఎంటి, పైలెట్ల అందరిని అప్కాస్‌లో చేర్చాలి.
- తల్లీ బిడ్డా ఎక్స్‌ప్రెస్‌లోని ఉద్యోగులందరినీ అప్కాస్‌లో చేర్చి జీవో ప్రకారం వేతనాలివ్వాలి.
- 104 ఎంఎంయూ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి, శ్లాబ్‌లు అప్‌గ్రేడ్ చేసి వేతనాలు చెల్లించాలి.

ఆందోళన ఇలా..

తమ డిమాండ్లు నెరవేర్చే వరకు దశలవారీగా ఆందోళన చేపడుతూ చివరిగా సమ్మెలోకి వెళ్లనున్నారు. జగనన్నకు చెబుదాంలో భాగంగా గురువారం 1902కు కాల్ చేస్తారు. 14న ప్రజా ప్రతినిధులకు, మంత్రులకు సామూహిక వినతిపత్రాల అందజేత. 16న సీఎంకు ఈ-మెయిల్ ద్వారా వినతులు. 21న కలెక్టరేట్ వద్ద ధర్నా. 22వ తేది స్పందనలో సమస్య తెలపడం. అప్పటికీ సమస్యలు పరిష్కారంకాకుంటే 23 నుంచి సమ్మెలోకి వెళ్లనున్నారు.







మామిడి రైతుల గురించి పట్టించుకోరా ?


మండల మీట్‌లో ప్రశ్నిస్తున్న సర్పంచ్ నాగిరెడ్డి

రొంపిచెర్ల, జనవరి 10: మండలంలోని మామిడి రైతుల గురించి ఉద్యానవన శాఖ అధికారులు పట్టించు కోలేదని జాండ్లవారిపల్లె పంచాయతీ సర్పంచ్ నాగిరెడ్డి ప్రశ్నించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ మండలంలో సుమారు 6వేలు కుటుంబాలకు ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డులు ఇచ్చామన్నారు. పశు టీకాలకు రూ.400 తీసుకుంటున్నారని సభ్యులు అడిగిన ప్రశ్నకు పశువైద్యాధికారి డాక్టరు శ్రీధర్ మాట్లాడుతూ గతంలో ప్రైవేట్ వ్యక్తులు తీసుకున్నారు కానీ ఇప్పుడు అలా జరగలేదన్నారు. జడ్పీటీసీ రెడ్డీశ్వరరెడ్డి మాట్లాడుతూ మామిడి కాయలకు కట్టే కవర్లు ఒక్కొక్కటి రూ1.75ల ప్రకారం సచివాలయంలో కట్టి పొందవచ్చన్నారు. సమావేశంలో సీనియర్ అసిస్టెంట్ రెడ్డెప్ప, ఎంపీడీవో రాజేంద్ర, తహసీల్దార్ అమరనాథ్, ఏఈ రాంప్రసాద్‌రెడ్డి, డీటీ లోకేష్, ఎంఈవో శ్రీనివాసులు సర్పంచులు ప్రసాద్‌నాయుడు, ఇబ్రహీంఖాన్, ఎంపీటీసీలు తదితర అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల నిరసన



పలమనేరు, జనవరి10 : పలమనేరులో మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు తమ కోర్కెల సాధన కోసం బుధవారం కూడా తమ ఆందోళన కార్యక్రమాన్ని కొనసాగించారు. వారికి మద్దతుగా పాల్గొన్న ఏఐటీయూసీ నాయకుడు మద్దెల సుబ్రమణ్యం మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు చేస్తున్న ఆందోళన న్యాయసమ్మతమైందని, ఇకనైనా ప్రభుత్వం గుర్తించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘ నాయకులు శ్రీనివాసులు, జాన్‌ఆనంద్, వై.బాబు, ఎం.బాలాజి, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు బెయిల్ రాకపై సంబరాలు

కుప్పం, జనవరి 10: ఆలస్యమైనా న్యాయానికి ఎప్పుడూ విజయం లభిస్తుందని టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ అన్నారు. చంద్రబాబుపై ఉన్న అన్ని కేసుల్లో హైకోర్టులో బెయిలు లభించిన నేపథ్యంలో కుప్పంలో టీడీపీ శ్రేణులు బుధవారం సంబరాలు చేసుకున్నాయి. స్థానిక ఆర్టీసీ బస్టాండు కూడలిలో ఎన్టీఆర్ విగ్రహం వద్దకు చేరుకుని బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచిపెట్టుకున్నారు. చంద్రబాబుకు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. జై చంద్రబాబు అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్, ఇతర నాయకులు మాట్లాడుతూ అధినేత చంద్రబాబుపై కుట్రపూరితంగా అక్రమ కేసులు బనాయించారని ఆరోపించారు. ఎన్నికల్లో ఓటమి తప్పదన్న భయంతో టీడీపీ కార్యకర్తలు, నాయకులపై క్రమంగా అనేక కేసులు బనాయించి జైళ్ల పాలు చేశారని గుర్తు చేశారు. కానీ న్యాయం ఎప్పుడూ గెలిచి తీరుతుందన్నారు. త్వరలోనే ఆయన అన్ని కేసులనుంచి బయట పడుతారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రతాప్, ఆర్‌ఆర్.రవి, శాంతారాం, దాము, సతీశ్, రామచంద్ర, వేణు తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు



కుప్పం, జనవరి 10: కుప్పంలోని ప్రభుత్వ వృత్తివిద్యా కళాశాలలో బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. సంప్రదాయ దుస్తులలో హాజరైన విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది కళాశాల ఆవరణలో రంగవల్లులను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. చెరకు గడలను ఉంచి, కట్టెల పొయ్యిమీద పాలు పొంగించి పరమాణ్ణం వండి నోళ్లు తీపి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జ్యోతీశ్వరన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

పలమనేరు, జనవరి10 : ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం విద్యార్థులకు బీఆర్ అంబేడ్కర్ జీవితంపై వ్యాసరచన, వక్తృత్వపోటీలు నిర్వహించారు. పలమనేరు ప్రభుత్వ పాఠశాలలో ఈ పోటీలను ఎంఈఓ లీలారాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. వ్యాసరచనలో బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు పి.వర్ష, ముష్కన్, బి.భావన ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వక్తృత్వపోటీల్లో దొడ్డిపల్లి ఉన్నతపాఠశాల విద్యార్థి లోహిత్ రెడ్డి, బాలికోన్నత పాఠశాల విద్యార్థిని ముష్కన్, దొడ్డిపల్లి ఉన్నతపాఠశాల విద్యార్థి కిరణ్‌బాబు ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాల్లో నిలిచారు.

కల్లూరు : పులిచెర్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 19న విజయవాడలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు నాందిగా విద్యార్థులకు ఆయన జీవితంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. వ్యాసరచన పోటీల్లో కల్లూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు భాను, కుష్రిన్‌తాజ్ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. వక్తృత్వపు పోటీల్లో కల్లూరు ప్రభుత్వ పాఠశాల విద్యార్థి జేఎస్ సబీహ ప్రథమస్థానం, కావేటిగారిపల్లి విద్యార్థిని తనూశ్రీ ద్వితీయ స్థానంలో నిలిచారు.

రొంపిచెర్ల : స్థానిక బాలికోన్నత పాఠశాలలో అంబేడ్కర్ జీవిత చరిత్రపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అమరనాథ్, ఎంఈవోలు శ్రీనివాసులు, ఇందిర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుంగనూరు రూరల్ : వ్యాసరచన పోటీల్లో జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థి మెహ్నాదా ఎంపికైనట్లు బసవరాజ బాలికల కాలేజీ ప్రిన్సిపాల్ కమలాకర్ తెలిపారు. స్థానిక కాలేజీ ఆవరణలో విద్యార్థులకు సామాజిక న్యాయం-విద్యార్థుల పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

5జీ టెక్నాలజీపై శిక్షణ

గంగవరం, జనవరి 10 : ఇంజనీరింగ్ విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించడానికి డీఏడీబీ(జర్మన్ కంపెనీ), మదర్‌థెరీసా కళాశాలలు సంయుక్తంగా ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు కరస్పాండెంట్ రవీంద్రబాబు తెలిపారు. బుధవారం కళాశాలలో ఒప్పందపత్రాన్ని చూపి వివరాలను ఆయన వెల్లడించారు. మదర్‌థెరీసా కళాశాలలో 3వ సంవత్సరం విద్యార్థులకు 5జి కమ్యూనికేషన్ టెక్నాలజీపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ సునీల్, అకడమిక్ డైరక్టర్ రాజేంద్రరెడ్డి, ప్రిన్సిపాల్ లక్ష్మీకాంతరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

శ్మశాన స్థలం కేటాయించాలి

గంగవరం, జనవరి 10 : మండలంలోని తెట్టుమిట్ట దళితులకు శ్మశాన స్థలం కేటాయించాలని మానవహక్కుల సంఘ నాయకులు బుధవారం డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్నకు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా తెట్టుమిట్ట గ్రామస్తులకు శ్మశాన స్థలం లేకపోవడంతో, ఎవరైనా చనిపోతే చెరువులు, వంకలలలో పూడ్చవలసి వస్తోందన్నారు. శ్మశాన స్థలం కేటాయించి న్యాయం చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు డీవీ మునిరత్నం, వేలాయుధం, రవికుమార్, గ్రామస్తులు సుబ్రమణ్యం, ఆనంద్, రెడ్డెప్ప, వినోద్ కుమార్, శ్రీనివాసులు, బాలు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో చెరువుల కనుమరుగు : చల్లా

పుంగనూరు, జనవరి10: వైసీపీ నాయకులు చెరువులను కనుమరుగు చేస్తున్నారని, త్వరలోనే ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా బుధవారం కుమ్మరనత్తం, కపాడమిట్టపల్లె, పిచ్చిగుట్లపల్లె, రాజులూరు, బాలగురవయ్యగారిపల్లె, పెంచుపల్లె, గూడూరుపల్లె, కొండసముద్రం, అగ్రహారం తదితర గ్రామాల్లో పర్యటించి కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో చెరువులను కనుమరుగు చేయడం, మైనింగ్‌ను పూర్తిగా దోచుకు తింటున్నారని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభివృద్ధికి ఎలాంటి నిధులు కేటాయించలేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాధవరెడ్డి, సీవీరెడ్డి, శ్రీకాంత్, ఆనూరి బాలాజీ, సుబ్రహ్మణ్యంరాజు, శమిపతి, సద్దాం హుసేన్, రెడ్డెప్పయాదవ్, ప్రసాద్, రమణ, జయరామ్, బాలప్ప యాదవ్, ఏ.గంగిరెడ్డి, వెంకటరెడ్డి, నాగరాజ, రాజప్ప, వేణు, శ్రీరాములు, గంగధర్, జయప్ప, రాజన్న, జనసేన నాయకులు పగడాల రమణ, చిన్నారాయల్, విరూపాక్షి, నరేశ్, చైతన్య, బాలాజీ నాయక్, పాములహరి, హరినాయక్, రమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

పుంగనూరు రూరల్, జనవరి10: స్థానిక బీఎంఎస్ క్లబ్ ఆవరణలో స్వామి వివేకనంద యువసేన ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రక్తం ఇవ్వదలచిన యువతీ, యువకులు శిబిరంలో పాల్గొనాలని వారు కోరారు.

కొనసాగుతున్న అంగన్వాడీల ఆందోళన


పలమనేరు, బైరెడ్డిపల్లెలలో నిరసన తెలుపుతున్న అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు

పలమనేరు, జనవరి10 : పలమనేరు ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట బుధవారం అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు బైఠాయించి నిరసన కార్యక్రమం కొనసాగించారు. నెలరోజులుగా అంగన్వాడీ వర్కర్లు, హెల్పరు తమ న్యాయమైన కోర్కెల సాధన కోసం ఆందోళన చేపట్టిన విషయం విదితమే. ప్రభుత్వం వారిని వెంటనే విధుల్లో చేరాలని, లేనిపక్షంలో ఎస్మా ప్రయోగిస్తామని చెబుతూ జీఓ నంబరు2ను జారీ చేసింది. అయినా రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీలు ఏమాత్రం ఖాతరు చేయకుండా ఆందోళన కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగానే పలమనేరులో కూడా బుధవారం నిరసన చేపట్టారు.

బైరెడ్డిపల్లె : తమ అపరిష్కృత సమస్యల పరిష్కారానికై అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె బుధవారం 30వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా బైరెడ్డిపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు బుధవారం కూడా తమ నిరసన కొనసాగించారు. సమ్మె చేపట్టి 30 రోజులు అయిన సందర్భంగా వారు వినూత్నంగా 30 ఆకారంలో కూర్చుని నిరసన తెలియజేశారు. తమ సమస్యలపై ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో పంచాయతీలు నిర్వీర్యం

మాజీ మంత్రి అమరనాథ రెడ్డి


జనసేన జెండాను ఎగురవేస్తున్న అమరనాథ రెడ్డి

గంగవరం, జనవరి 10: గ్రామ పంచాయతీల నిధులను పక్కదారి పట్టించి, వాటిని నిర్వీర్యం చేసిన ఘనుడు జగన్ అని మాజీ మంత్రి అమరనాథ రెడ్డి ఎద్దేవా చేశారు. మండలంలోని కల్లుపల్లె, గంగవరం పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో బుధవారం ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటా తిరిగి వారికి అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అమర్ మాట్లాడుతూ ఒక్కచాన్స్ అంటూ ప్రజలను వేడుకొని అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామీణ అభివృద్ధిని పూర్తిగా విస్మరించారన్నారు. గత ప్రభుత్వ హయాంలో వేసిన ఎల్ఈడీ బల్బులే నేడు గ్రామాలకు దిక్కుగా ఉన్నాయన్నారు. దశలవారీగా మద్యనిషేదం అంటూ హామీలిచ్చి నేడు కర్ణాటక మద్యాన్ని గ్రామాల్లో ఏరులై పారిస్తున్నారని దుయ్యబట్టారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రంలో యువత, బీసీ, ఎస్సీ, ఎస్టీలతో పాటు అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు సోమశేఖర్ గౌడ్, నళిని, ప్రతాప్‌రెడ్డి, రామ్మోహన్‌నాయుడు, ఆలకుప్పం రాజన్న, సతీష్, సుబ్బారెడ్డి, జయసింహ, హరికృష్ణప్రసాద్‌నాయుడు, యుగంధర్, గిరి, బెజవాడ భరత్, మురళి, బట్టందొడ్డి సుధ, సుబ్రమణ్యం గౌడు, ఆర్‌బీసీ కుట్టి, అమరనాథ్ రెడ్డి, రామూర్తి నాయుడు, జనసేన దిలీప్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ యువతను ప్రోత్సహించడానికే క్రీడలు


కబడ్డీలో పోటీ పడుతున్న క్రీడాకారులు

పుంగనూరు రూరల్, జనవరి10: గ్రామీణ యువతను క్రీడల్లో ప్రోత్సహించడానికే క్రీడలు నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఏతూరు వద్ద మండల స్థాయి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి మనోహర్ మాట్లాడుతూ పట్టణ పరిధిలోని 16 సచివాలయాలు, మండలంలోని 21 సచివాలయ పరిధిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను మండల స్థాయిలో క్రీడలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ తదితర క్రీడలు నిర్వహించినట్లు తెలిపారు. క్రీడల్లో 70 టీములు పాల్గొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో నారాయణ, సచివాలయ సిబ్బంది , పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

సదుం : మండల కేంద్రంలోని గురుకుల పాఠశాల, జడ్పీ ఉన్నత పాఠశాల, పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లలో ఆటల పోటీలు నిర్వహించారు. మొదటి రోజున కబడ్డీ, క్రికెట్, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఎంపీపీ యల్లప్ప, జడ్పీటీసీ సోమశేఖర రెడ్డి, పీడీ, పీఈటీలు పాల్గొన్నారు.

కల్లూరు: మండలస్థాయి వాలీబాల్ క్రీడా పోటీల్లో విజేతగా మంగళంపేట సచివాలయం టీమ్ నిలిచినట్లు మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసులు, ఎంపీడీఓ రాజశేఖర్‌బాబు తెలిపారు. పులిచెర్ల ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బుధవారం క్రీడా పోటీలు నిర్వహించారు. ఫైనల్ పోటీల్లో మంగళంపేట, ఎల్లంకివారిపల్లి సచివాలయం టీమ్‌లు హోరాహోరీగా తలపడ్డాయి. ఫైనల్ విజేతగా మంగళంపేట సచివాలయం టీమ్ నిలిచింది. కార్యక్రమంలో ఎంఈఓలు శిద్దరామయ్య, పోకల తాతయ్య, ఏపీఓ షౌకత్, సర్పంచ్ రాణెమ్మ పాల్గొన్నారు.

సోమల : ఆడుదాం ఆంధ్ర క్రీడాకారులకు ప్రభుత్వం అందజేసిన దుస్తులు ఒకే కొలతలు ఉన్న దుస్తులు పంపిణీ చేయడంతో వాటిని ధరించి క్రీడలు ఆడలేక తమ సొంత దుస్తులనే ధరించారు. యువకుల్లో కొందరికి సైజు సరిపడకపోవడంతో ఈపరిస్థితి నెలకొంది. బుధవారం స్థానిక జూనియర్ కళాశాల, హైస్కూల్‌లో క్రికెట్ పోటీలు హోరా హోరీగా సాగాయి.

రొంపిచెర్ల : బాలుర ఉన్నత పాఠశాల సమీపంలోని మైదానంలో ఖోఖో, వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఎంపీపీ పురుషోత్తంరెడ్డి, ఎంపీడీవో రాజేంద్ర క్రీడలను ప్రారంభించారు. క్రీడా దుస్తులు సరిపడకపోవడంతో వారు వేసుకున్న బట్టలతో క్రీడల్లో పాల్గొన్నారు.

సదుం : మండల కేంద్రంలోని గురుకుల పాఠశాల, జడ్పీ ఉన్నత పాఠశాల, పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లలో ఆటల పోటీలు నిర్వహించారు. మొదటి రోజున కబడ్డీ, క్రికెట్, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ యల్లప్ప, జడ్పీటీసీ సోమశేఖర రెడ్డి, పీడీ, పీఈటీలు పాల్గొన్నారు.

పలమనేరు : పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం మండల స్థాయి క్రికెట్ పోటీలను ఎంపీడీఓ విద్యాసాగర్ ప్రారంభించారు. మొత్తం 46 క్రికెట్ జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి.

బైరెడ్డిపల్లె : బైరెడ్డిపల్లెల మండలస్థాయి క్రీడాపోటీలను ఎంపీపీ రెడ్డెప్ప ప్రారంభించారు. మొదటిరోజు వాలీబాల్ పోటీల్లో పాతూరునత్తం సచివాలయ పరిధిలోని టీమ్ విన్నర్స్‌గా గెలుపొందారు. ఎంపీడీవో రాజేంద్రబాలాజీ, ఎంఈవోలు సాయిలీల, సుబ్రమణ్యం, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

రాయలసీమ చిల్డ్రన్ అకాడమీలో సంక్రాంతి సంబరాలు



పుంగనూరు, జనవరి10: రాయలసీమ చిల్డ్రన్ అకాడమీలో సంక్రాంతి సంబరాలు వైభవంగా నిర్వహించారు. బుధవారం పాఠశాల డైరెక్టర్ చంద్రమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో రంగురంగుల ముగ్గులు వేశారు. ముగ్గులు వేయడంలో ప్రతిభ కనబరించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అనంతరం భోగిమంటలు వేసి సంక్రాంతి పండుగ విశిష్టతను పిల్లలకు వివరించారు. కార్యక్రమంలో ఎంఈవో చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం

బైరెడ్డిపల్లె,జనవరి10: బైరెడ్డిపల్లె ప్రాథమిక పాఠశాలలో బుధవారం కళాతరంగిణి సంస్థ ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఆకర్షణీయమైన ముగ్గులు వేసిన వారికి ఎంఈవోలు సాయిలీల, సుబ్రమణ్యం ప్రోత్సాహక బహుమతులందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం చైతన్య, ఎండీహెచ్ ట్రస్ట్ ఛైర్మన్ పవన్‌కల్యాణ్, విశ్రాంత ఉపాధ్యాయులు మునెప్ప, చంద్రశేఖర్, ముగ్గులపోటీల న్యాయనిర్ణేత మమత, నిర్వాహకులు మురళీధర్, శ్రీనివాసులు, మస్తాన్, రాజగోపాల్, రాజన్న, చిన్నప్ప, సీఆర్పీలు రామచంద్ర, వెంకటరమణ, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

చెరువుముందరపల్లెలో బియ్యం పంపిణీ

పుంగనూరు, జనవరి 10: సదుం మండలం పాలమంద పంచాయతీ చెరువు ముందరపల్లె గ్రామస్తులకు బుధవారం ఎండీయూ వాహనం ద్వారా రేషన్ బియ్యం పంపిణీ చేశారు. ఈనెల 6వ తేదీ ఆంధ్రజ్యోతిలో ఇలాగైతే మాకొద్దు! ఎంయూడీ వాహనాన్ని వెనక్కి పంపిన ప్రజలు అనే శీర్షికతో వార్త ప్రచురితం కావడంతో రెవెన్యూ అధికారులు స్పందించారు. ఈ మేరకు గ్రామంలో రేషన్ కార్డుదారులు అందరికీ నిత్యావసర వస్తువులు అందజేశారు.

వివాహిత ఆత్మహత్య



పుంగనూరు రూరల్, జనవరి10: ఓ వివాహిత ఇంటిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు సీఐ రాఘవరెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు ... పట్టణంలోని హిదాయత్ నగర్‌కు చెందిన పురుషోత్తంతో మదనపల్లె మండలం ఆచార్లపల్లెకు చెందిన హేమలతతో 23ఏళ్ల క్రితం వివాహం జరిగింది. ఇంటి నిర్మాణం కోసం ఆమె బంగారు నగలను భర్త రూ. 4లక్షలకు బ్యాంకులో తాకట్టు పెట్టాడు. బుధవారం ఉదయం తన బంగారు నగలు కావాలని భర్త పురుషోత్తంను నిలదీసింది. త్వరలోనే తీసుకువస్తానని చెప్పి బెడ్‌రూమ్‌లోకి వెళ్లి తలుపులు వేసుకున్నట్లు భర్త తెలిపినట్లు సీఐ తెలిపారు. కొంత సమయం తర్వాత తలుపులు తీయమని చెప్పగా తీయకపోవడంతో తలుపులు బద్దలు కొట్టి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతుండగా కిందకు దించి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించినట్లు తెలిపారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ సంఘటనా స్థలానికి చేరుకుని జరిగిన సంఘటనపై ఆరా తీసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఎస్టీయూ మండల కార్యవర్గం ఎన్నిక


బాబురెడ్డి, గురుప్రసాద్

పెద్దపంజాణి, జనవరి 10: మండల ఎస్టీయూ అధ్యక్షుడుగా నాగిరెడ్డిపల్లె పాఠశాలలో పనిచేస్తున్న బాబురెడ్డి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. బుధవారం శ్రీరామాపురం ప్రాథమిక పాఠశాలలో ఎస్టీయూ నూతన కార్యవర్గం ఎంపిక జరిగింది. ఈ ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర ఎస్టీయూ నాయకుడు లింగమూర్తి హాజరయ్యారు. వరుసగా మూడోసారి అధ్యక్షుడుగా బాబురెడ్డిని ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా గురుప్రసాద్, ఆర్థిక కార్యదర్శిగా శివప్రకాష్‌బాబు, సీపీఎస్ కన్వీనర్‌గా హరీష్, ఉపాధ్యాయ వాణి కన్వీనర్‌గా బాలాజీ, మహిళా కన్వీనర్‌గా స్వర్ణకుమారి తదితరులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీయూ నాయకులు మోహన్, జిల్లా నాయకులు దేవరాజులురెడ్డి, కడియాల మురళి, గంగామోహన్ తదితరులు హాజరయ్యారు.

సోమల మార్కెట్ యార్డులో పనుల జోరు



సోమల, జనవరి 10: సోమల మార్కెట్ యార్డులో నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. నాలుగేళ్ల క్రితం యార్డు నిర్మాణ పనులకు ప్రభుత్వం రూ. 4కోట్లు మంజూరు చేసింది. ఈక్రమంలోనే రెండేళ్ల క్రితం పనులు ప్రారంభించి సీసీ రోడ్లు పూర్తి చేశారు యార్డులో కొన్ని పనులు చేసి బిల్లులు సక్రమంగా అందకపోవడంతో కాంట్రాక్టర్ వదిలేశారు. పలుమార్లు రైతులు మంత్రి పెద్దిరెడ్డికి ఫిర్యాదు చేశారు. ఆయన చొరవ తీసుకుని రూ. 50 లక్షలు నిధులు మంజూరు చేయించారు. దీంతో కాంట్రాక్టర్ తిరిగి పనులు ముమ్మరం చేశారు.

ఫెడరల్ బ్యాంక్ బ్రాంచ్ ప్రారంభం

పలమనేరు, జనవరి10 : పలమనేరులోని మదనపల్లి రోడ్డులో ఫెడరల్ బ్యాంక్ తన బ్రాంచ్‌ని బుధవారం ప్రారంభించింది. ఈ బ్రాంచ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మదర్ థెరీసా విద్యాసంస్థల ఛైర్మన్ ఎం.సునీల్, చిత్తూరు ఛార్టెడ్ అకౌంటెంట్ రమేష్‌బాబు, పారిశ్రామిక వేత్త గాలి సుబ్రమణ్యంనాయుడు, ఫెడరల్ బ్యాంక్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ బి.దిలీప్, డిప్యూటీ వైస్‌ప్రెసిడెంట్ స్వాతిప్రియ, పలమనేరు బ్రాంచ్ మేనేజర్ ఎ. మహేంద్రాచారి పాల్గొన్నారు.

హిందీ భాషపై పట్టు సాధించాలి

పుంగనూరు రూరల్, జనవరి10: విద్యార్థులు హిందీభాషపై పట్టు సాధించాలని శుభారాం ప్రభుత్వ డిగ్రీకాలేజీ హిందీ ఉపాధ్యాయురాలు స్రవంతి కోరారు. హిందీభాష దినోత్సవం సందర్భంగా బుధవారం కాలేజీ ఆవరణలో ఆమె మాట్లాడుతూ విద్యార్థులు హిందీ నేర్చుకోవడం వల్ల ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ప్రిన్సిపాల్ రాజశేఖర్, అధ్యాపకులు విజయశ్రీ, రామ్‌కుమార్, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

14న ముగ్గుల పోటీలు

పుంగనూరు, జనవరి10: ఈనెల 14న బీసీవై పార్టీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నాయకులు సాంబమూర్తి, హరినాథ్‌రెడ్డి తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని మండలాల మహిళలు సంక్రాంతి పండుగ సందర్భంగా ఇళ్ల ముందు వేసిన ముగ్గుల వద్ద నిలబడి మహిళలు సెల్ఫీ తీసి వారి ఏదైనా గుర్తింపుకార్డును వాట్సప్‌లో 14తేదీ సాయంత్రం లోపు పంపాలని కోరారు. పుంగనూరు మండల పరిధిలోని వారు సెల్: 9059984052, పట్టణ పరిధిలోనివారు సెల్: 9059984052, చౌడేపల్లె మండలంలోని వారు. సెల్: 6281942310, సోమల మండలం వారు సెల్: 6305973493, సదుం మండలం వారు సెల్: 7670884187, పులిచెర్ల మండలంలోని వారుసెల్: 9182933764, రొంపిచెర్ల మండలంలోని వారు సెల్: 8309957983 నంబర్లకు వాట్సప్ చేయాలని కోరారు. మొదటి బహుమతి రూ. 50116లు, ద్వితీయ బహుమతి మండలానికి ముగ్గురు చొప్పిన ఎంపిక చేసి 21మందికి ఒక్కొక్కరికి రూ. 25,116లు, తృతీయ బహుమతి మండలానికి 9మందిని ఎంపిక చేసి 63మందికి ఒక్కొక్కరికి రూ. 5116లు ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఆలయ హుండీ లెక్కింపు



చౌడేపల్లె, జనవరి10: స్థానిక బజారు వీధిలో వెలసిన అభీష్టద మృత్యుంజయేశ్వర స్వామి ఆలయానికి హుండీ లెక్కింపు ద్వారా రూ.1.36 లక్షలు ఆదాయం చేకూరినట్లు గ్రూప్ టెంపుల్స్ ఈవో కమలాకర్ పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 4 నెలలకు గాను భక్తులు స్వామివారికి రూ.1,36,570 నగదు హుండీలో కానుకలుగా సమర్పించినట్లు తెలిపారు. ఈ మొత్తాన్ని పుంగనూరు ఇండియన్ బ్యాంకులో డిపాటిట్ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రూప్ టెంపుల్స్ ఇన్ స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది హరి, అర్చకులు రాజశేఖర్‌దీక్షితులు, కుమార్ పాల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్య అక్షింతలు

చౌడేపల్లె, జనవరి 10: అయోధ్య శ్రీరాముడి అక్షింతలను విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఇంటింటికీ పంపిణీ చేశారు. బుధవారం స్థానిక చౌడేపల్లె, గోసలకురప్పల్లెలో వీహెచ్‌పీ సభ్యులు ఇంటింటికి వెళ్లి అక్షింతలు, ఫొటోలు పంపిణీ చేశారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా ఉండాలి

రొంపిచెర్ల, జనవరి 10: ప్రజలనుంచి వచ్చే ఓటర్ల సమస్యలు, చేర్పులు, తొలగింపులను బీఎల్‌వోలు క్షుణ్ణంగా పరిశీలించి ఓటర్ల జాబితా పారదర్శంగా ఉండేలా పనిచేయలని తహసీల్దార్ అమరనాథ్ సూచించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలు, సూపర్ వైజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12వ తేదీలోగా 18ఏళ్లు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవచ్చని, మృతులకు సంబంధించిన క్లయిమ్‌లు పరిశీలించి తొలగించాలని తెలిపారు.

పశు వైద్యశిబిరం విజయవంతం

కల్లూరు, జనవరి 10: కల్లూరు తలావారిపల్లెలో బుధవారం జిల్లా నీటియాజమాన్య సంస్థ, పశుసంవర్ధకశాఖ సంయుక్తంగా నిర్వహించిన పశువైద్య శిబిరం విజయవంతమైంది. సుమారు 300 పశువులకు వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి మునిచంద్ర, సర్పంచ్ షుకూర్, ఎంపీటీసీ రెడ్డిబాబుల్లా, వాటర్‌షెడ్డు ఛైర్మన్ షౌకత్, పశువైద్య శిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

కల్లూరు, జనవరి 10: పులిచెర్ల మండలం వెంకటదాసరపల్లె ప్రాథమికోన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని బుధవారం జడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి పరిశీలించారు. తాగునీరు, విద్యుత్ సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



పలమనేరు, జనవరి10 : పలమనేరు అన్నక్యాంటీన్ వద్ద బుధవారం మధ్యాహ్నం మాజీమంత్రి అమరనాథ రెడ్డి, రేణుకారెడ్డి దంపతుల కుమారుడు ప్రసేన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా రేణుకారెడ్డి పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అంతకు ముందు ఆమె టీడీపీ నాయకుల సమక్షంలో కేక్ కట్‌చేసి నాయకులకు, కార్యకర్తలకు పంచిపెట్టారు.

ఘనంగా సమతా సంకల్పం

కుప్పం, జనవరి 10: కుప్పం మున్సిపాలిటీలో బుధవారం సమతా సంకల్పం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ ఛైర్మన్ సుధీర్, వైస్ ఛైర్మన్ మునస్వామితోపాటు కౌన్సిలర్లు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే ఆరో వార్డు అనిమిగానిపల్లె, తంబిగానిపల్లెల సచివాలయాలకు సంబంధించి జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని కొత్తపేట అర్బన్ హెల్త్ సెంటర్‌లో నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్‌తోపాటు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కుప్పం సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో తనిఖీలు

కుప్పం, జనవరి 10: కుప్పం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో బుధవారం డిస్ట్రిక్ రిజిస్ట్రార్ శ్రీనివాసరావు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్ మాట్లాడుతూ దళారులను ఆశ్రయించకుండా నేరుగా కార్యాలయం ద్వారానే రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని ప్రజలను కోరారు. పారదర్శకంగా రిజిస్ట్రేషన్లు జరుగుతాయన్నారు. ఒకవేళ ఎవరైనా లంచాలు కోరినా తనకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటానని చెప్పారు.

యువకాపునాడు అధ్యక్షుడికి సత్కారం

పలమనేరు, జనవరి10 : యువకాపునాడు రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన పలమనేరుకు చెందిన పూలచైతన్యను బుధవారం స్థానిక కాపునాయకులు పూలమాలలు వేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాపు నాయకులు ఆకుల గజేంద్రప్రసాద్, సుధాకర్, బాబు, నరసింహులు, దైవప్రసాద్, పగడాల ప్రవీణ్, అమ్ములు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

గాయపడ్డ మహిళ మృతి

సోమల, జనవరి 10: చిన్నఉప్పరపల్లె పంచాయతీ సవరంవారిపల్లెకు చెందిన ట్రాన్స్‌కో లైన్‌మెన్ ఎస్‌వీ రమణ భార్య శారద (50) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బుధవారం మృతి చెందింది. జనవరి 1వ తేదీ రాత్రి రమణ, శారద సొంత కారులో తిరుపతి నుంచి స్వగ్రామానికి వస్తుండగా తొండవాడ వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో భార్యభర్తలిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. ఇరువురూ తిరుపతి ప్రైవేటు వైద్యశాలలో చికిత్సలు పొందుతుండగా శారద మృతి చెందింది.

వేణుగోపాలస్వామి మాన్యంలో మంత్రి గన్‌మెన్ అక్రమ నిర్మాణం



వేణుగోపాల స్వామి మాన్యంలో నిర్మాణాలను పరిశీలిస్తున్న దేవదాయశాఖ అధికారులు

చౌడేపల్లె, జనవరి10: చౌడేపల్లె బజారువీధిలోని వేణుగోపాల స్వామి ఆలయ మాన్యంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఇద్దరు గన్‌మ్యాన్లు అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారు. బుధవారం ఈ విషయం తెలుసుకున్న దేవదాయశాఖ గ్రూప్ టెంపుల్స్ ఈవో కమలాకర్, ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి ఆ నిర్మాణాలను పరిశీలించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని చెప్పారు. ఈ ఆలయ భూములు చౌడేపల్లెతోపాటు, వివిధ గ్రామాల్లో ఉన్నాయి. చౌడేపల్లె బస్టాండు సమీపంలోని మాన్యం భూమికి డిమాండుతో పాటు విలువ కూడా అధికంగా ఉంది. దీంతో కొంతకాలంగా రాజకీయ అండదండలు ఉన్న వ్యక్తులు దురాక్రమణకు పాల్పడుతూనే ఉన్నారు. ఇక, మంత్రి పెద్దిరెడ్డికి గన్‌మేన్లుగా వ్యవహరిస్తున్న ఇద్దరు విలువైన ఆ మాన్యం భూమిపై కన్నేశారు. కొన్నిరోజులుగా వేణుగోపాలుడి మాన్యం భూమినే కబ్జా చేసి నిర్మాణాలు శరవేగంగా చేస్తున్నారు. ఇంతకాలం రెవెన్యూ, దేవదాయశాఖ అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు దారితీస్తోంది. కలెక్టర్ స్పందించి మాన్యం భూముల దురాక్రమణలను అరికట్టాలని భక్తులు కోరుతున్నారు.

కాశీవిశ్వేశ్వరస్వామి మాన్యంలో అక్రమ నిర్మాణాలపై చర్యలు

గ్రూప్ టెంపుల్స్ ఈవో కమలాకర్

చౌడేపల్లె, జనబరి10:కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ మాన్యం భూమిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటామని గ్రూప్ టెంపుల్స్ ఈవో కమలాకర్ పేర్కొన్నారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో కాశీవిశ్వేశ్వరస్వామి మాన్యంలో అక్రమ నిర్మాణంపై కథనం రావడంతో తాము వచ్చినట్లు ఆయన తెలిపారు. మాన్యం భూమిలో అక్రమంగా 4 అంతుస్తుల భవనం నిర్మిస్తున్న వ్యక్తులతో మాట్లాడి నిర్మాణం అపేయాలని ఆదేశించారు. మాన్యం భూమిలో సుమారు 70 మందికి పైగా దురాక్రమణలు చేశారని, వారందరికీ దేవదాయ శాఖ ట్రిబ్యునల్ ఆదేశాలతో తదుపరి చర్యలు ఉంటాయన్నారు. అలాగే రెండు మూడు రోజులలో మాన్యం భూమిలో బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు.

22న తుది ఓటర్ల జాబితా విడుదల

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 10: తుది ఓటర్ల జాబితాను ఈనెల 22న విడుదల చేస్తున్నట్లు జిల్లా రెవిన్యూ అధికారి రాజశేఖర్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. గతనెల 9వ తేదీ వరకు అందిన దరఖాస్తులకు సంబంధించిన విచారణ ఈనెల 12వ తేదీతో ముగుస్తుందన్నారు. 25న జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ప్రధాన కేంద్రాల్లో, విద్యాసంస్థల్లో ఓటర్ల అవగాహన కోసం ఈవీఎంల పనితీరును వివరిస్తూ ప్రదర్శన జరుగుతుందని వివరించారు. ఓటరు జాబితాలో తమ పేరు నమోదు కోసం ఓటర్లు దరఖాస్తులను నిరంతరం అందజేయవచ్చని, దానికి తుది గడువులేదని స్పష్టం చేశారు. పార్టీల ప్రతినిధులు సురేంద్ర కుమార్ (టీడీపీ), ఉదయ్‌కుమార్ (వైఎస్సార్‌సీపీ), గంగరాజు (సీపీఐ), అట్లూరి శ్రీనివాసులు (బీజేపీ), ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ దూరవిద్య ప్రవేశానికి గడువు పొడిగింపు

చిత్తూరు (సెంట్రల్), జనవరి 10: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్సిటీ దూరవిద్య డిగ్రీలో ప్రవేశానికి ముగిసిన గడువును ఈనెల 31 వరకు పొడిగించినట్లు సెంటర్ కోఆర్డినేటర్ మీరాసాహెబ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగి డిగ్రీ చదవాలనుకునే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఫిబ్రవరిలోగా లైఫ్ సర్టిఫికెట్లు అందించండి

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 10: జిల్లాలోని సర్వీస్, ఫ్యామిలీ పెన్షనర్లు, ఇతర పెన్షనర్లు 2023-24 సంవత్సరానికి సంబంధించి లైఫ్ సర్టిఫికెట్లను ఫిబ్రవరి నెలాఖరులోగా అందజేయాలని జిల్లా ఖజానాశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం.రామచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని సబ్‌ట్రెజరీ కార్యాలయాల్లో లైఫ్‌సర్టిఫికెట్ల వివరాలను నమోదు చేయాలని, సాంకేతిక ఇబ్బందులు ఏర్పడితే నేరుగా కార్యాలయాలకు వచ్చి అందించాలన్నారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి ఇన్‌కం ట్యాక్స్ రికవరీ సేవింగ్స్ ఫామ్‌లు, ఎంత మేర ట్యాక్స్ తగ్గింపు వర్తిస్తుందో అనే విషయాలు సమీప సబ్‌ట్రెజరీ అధికారిని కలిసితెలుసుకోవాలని సూచించారు.ఈనెల 20వ తేదీలోగా ఇన్‌కం ట్యాక్స్ రికవరీ వివరాలు సబ్‌ట్రెజరీ కార్యాలయానికి అందజేయాలని పేర్కొన్నారు.

గణతంత్ర దిన వేడుకలకు పలమనేరు విద్యార్థి



ఇలవరసన్

పలమనేరు, జనవరి10: ఢిల్లీలో ఈనెల 26వ తేది నిర్వహించే గణతంత్ర దిన వేడుకల్లో పాల్గొనేందుకు పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ఆర్.ఇలవరసన్ ఎంపికైనట్లు ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ టి. బాలాజి తెలిపారు. బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఇలవరసన్ ఇటీవల సికింద్రాబాద్‌లో జరిగిన ప్రీరిపబ్లిక్ క్యాంపుల్లో ప్రతిభ కనబరచి 35వ ఆంధ్ర బెటాలియన్ తరపున ఎంపికయ్యారని బాలాజి తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. వెంకటేసులు, వైస్ ప్రిన్సిపాల్ విజయశేఖరం మాట్లాడుతూ పలమనేరు గంటావూరు కాలనీకి చెందిన ఇలవరసన్ క్రమశిక్షణ కలిగిన విద్యార్థి అని, ప్రాథమికపరీక్షలో యూత్‌ఎక్స్చేంజ్ ప్రోగ్రామ్‌కు కూడా ఎంపికయ్యాడని, తుది పోటీల్లో ఎంపిక అవుతాడని ఆశిస్తున్నామని తెలిపారు.

రూ.35లక్షల వెండి స్వాధీనం

గుడిపాల, జనవరి 10: గుడిపాల మండలం.. తమిళనాడు సరిహద్దు ప్రాంతమైన ముస్లిరికుప్పం వద్ద బుధవారం పోలీసులు తనిఖీలు చేపట్టారు. బిల్లులు లేకుండా రూ.35లక్షలు విలువచేసే వెండిని తమిళనాడు నుంచి చిత్తూరుకు తీసుకొస్తుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. ఎన్నికల దృష్ట్యా ముస్లిరికుప్పంలో తనిఖీలు నిర్వహిస్తుండగా 49 కిలోల వెండి స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఏడు నాటు తుపాకులు స్వాధీనం : చిత్తపార గ్రామంలో బుధవారం పోలీసులు దాడులు నిర్వహించి ఏడు నాటు తుపాకులను స్వాధీనం చేసుకున్నారు. ఎవరి వద్దయినా నాటుతుపాకులుంటే స్వచ్ఛందంగా తెచ్చివ్వాలని, లేనిపక్షంలో తమ దృష్టికి వస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ హెచ్చరించారు.





పెనుమూరులో జగనన్న టీషర్టులు చాలక సరిపోక సాధారణ దుస్తుల్లో వాలీబాల్ అడుతున్న క్రీడాకారులు - సోమలలో ప్రభుత్వ దుస్తులను నిరాకరించిన కొందరు క్రీడాకారులు

ఇదెక్కడి 'ఆడుదాం ఆంధ్రా' బాబోయ్!

- మండల స్థాయిలో పోటీలు ప్రారంభం
- గ్రామస్థాయిలోలాగే ఇక్కడా ముందుకురాని క్రీడాకారులు
- కొత్తవారితో రిజిస్ట్రేషన్లు
- తీవ్ర ఒత్తిడిలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు
- సరిపోని టీ షర్టులు, నాణ్యత లేని కిట్లు

చిత్తూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): 'ఆడుదాం ఆంధ్రా' పోటీల నిర్వహణతో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు తీవ్ర ఒత్తిడిలో ఉన్నారు. బుధవారం నుంచి మండలస్థాయి పోటీలు ప్రారంభమయ్యాయి. గ్రామ స్థాయిలోలాగే ఇక్కడా క్రీడాకారుల నుంచి స్పందన పెద్దగా లేదు. ఎన్నికలు ముంచుకొస్తున్న వేళ ప్రభుత్వం ప్రచారం కలిసొచ్చేలా 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమాన్ని ప్రారంభించింది. సచివాలయాల స్థాయిలో పలురకాల ఆటలు ఆడించి, ఆ తర్వాత మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసేలా ప్లాన్ చేశారు. సరిపడా మైదానాలు లేక పొలాలనే చదును చేసి ఆడించారు. డిసెంబరు 26న తొలిరోజు నిర్వహించిన గ్రామ స్థాయి పోటీలకు క్రీడాకారులు, ప్రేక్షకుల నుంచి ఆదరణ కరువైంది. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు బలవంతంగా క్రీడాకారులు, ప్రేక్షకులను నమోదు చేశారు. ఆ తర్వాత జరిగిన పోటీల పరిస్థితీ అంతే. ఇక, బుధవారం నుంచి మండల స్థాయి పోటీలు మొదలుపెట్టారు. గ్రామ స్థాయిలో ప్రతిభ చూపించిన క్రీడా బృందాలను మండల స్థాయిలో ఆడించాల్సి ఉంది. అసలు చాలా చోట్ల గ్రామ స్థాయిలోనే పోటీలు జరగకపోవడంతో మండల స్థాయిలో ఆడేవారు కరువయ్యారు. దీంతో సచివాలయ ఉద్యోగులు మరోసారి క్రీడాకారుల్ని నమోదు చేయాల్సి వచ్చింది. బుధవారం తొలిరోజు మండల స్థాయి పోటీలు నిర్వహించగా, నాణ్యత లేని కిట్లతో.. సరిపోని టీషర్టులతో క్రీడాకారులు ఇబ్బంది పడ్డారు. మరికొందరు ఆ టీషర్టులు ధరించడానికి ఆసక్త చూపలేదు. దీంతో పెనుమూరు, సోమల తదితర మండలాల్లో సాధారణ దుస్తులతో పోటీల్లో పాల్గొన్నారు. పెనుమూరు మండలంలో 14 సచివాలయాలుండగా, 5 చోట్ల నుంచి క్రీడాకారులు మండల స్థాయి పోటీలకు రాలేదు. ఇదే పరిస్థితి అన్ని మండలాల్లోనూ ఉంది. జిల్లా వ్యాప్తంగా మండలాలు, మున్సిపాలిటీలను కలిపి 33 యూనిట్లుగా ఏర్పాటుచేసి మండల స్థాయి పోటీలను నిర్వహిస్తున్నారు. మండల స్థాయి పోటీల నిర్వహణకు 127 మైదానాలను సిద్ధం చేశారు. కొన్ని సచివాలయాల నుంచి మండల స్థాయి పోటీలకు జట్లు రాకపోయినా కొత్తవారితో నిర్వహిస్తున్నారు. గతంలో జరిగిన గ్రామ స్థాయి పోటీలకు 72820 మంది రిజిస్ట్రేషన్లు చేసుకోగా, 6120 మంది మాత్రమే పాల్గొన్నారు. ఈ లెక్కన చూసుకుంటే ఈ రిజిస్ట్రేషన్లన్నీ బలవంతంగా చేశారనే విషయం స్పష్టమవుతోంది.



కుప్పం టీడీపీ కార్యాలయంలో కరపత్రాలు విడుదల చేస్తున్న తెలుగు యువత నాయకులు

నిరుద్యోగ యువతను మోసం చేశారు

- సీఎం జగన్‌పై కుప్పం, వెదురుకుప్పం పోలీసు స్టేషన్లలో తెలుగు యువత ఫిర్యాదు

కుప్పం, జనవరి 10: అధికారంలోకి రాగానే ఉద్యోగాలిస్తానని చెప్పి ఇవ్వకుండా నిరుద్యోగులను మోసం చేశారంటూ ముఖ్యమంత్రి జగన్‌పై బుధవారం కుప్పం పోలీసుస్టేషన్‌లో తెలుగు యువత నాయకులు ఫిర్యాదు చేశారు. తెలుగుదేశం కార్యాలయం నుంచి ప్రదర్శనగా పోలీసు స్టేషన్ బయలుదేరిన నాయకులు, అక్కడ ఎస్ఐ సుబ్బారెడ్డిని కలిసి ఫిర్యాదు అందజేశారు. అధికారంలోకి రాగానే 2.5 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తానని, ఏటా జనవరి ఒకటో తేదీన జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని చెప్పి నిలువునా నమ్మించి ముంచేశారని విమర్శించారు. సీఎంఐ ప్రకారం రాష్ట్రంలో 2019 నాటికి 4 శాతం ఉన్న నిరుద్యోగిత 2023 డిసెంబరు నాటికి 6.6 శాతానికి పెరిగిందన్నారు. ఉపాధి, ఉద్యోగాల్లేక రాష్ట్రంలో గత మూడేళ్లలో 21,575 మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారని పార్లమెంటు సాక్షిగా కేంద్ర మంత్రి చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ జగన్‌రెడ్డి ప్రభుత్వం గంజాయి అక్రమ రవాణాలో ప్రథమస్థానంలో ఉన్నట్లు ఏసీబీ నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో నివేదిక చెబుతోందన్నారు. మరోవైపు గంజాయి, ఇతర మత్తుపదార్థాలకు బానిసలై ఏపీలో 571 మంది యువత ఆత్మహత్యలకు పాల్పడినట్లు క్రైమ్ బ్యూరో నివేదికలో ఉందన్నారు. వీటన్నింటిపై విచారించి సీఎంపై చర్యలు తీసుకుని రాష్ట్ర యువతకు న్యాయం చేయాలని ఆ ఫిర్యాదులో పోలీసులను కోరారు. అంతకుముందు టీడీపీ కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కుప్పం నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు వెంకటేశ్, రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి చెక్కునత్తం మణి, ప్రధాన కార్యదర్శి శంకర్, చలం, అశోక్, సుబ్బు, సుబ్రమణ్యం, రాజేంద్ర, వినోద్, గణేశ్, విజయ్, మనోహర్, బాలాజీ, గణపతి తదితరులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం పోలీసులకూ ఫిర్యాదు

వెదురుకుప్పం: ఎన్నికల ముందు నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా సీఎం జగన్ మోసం చేశారంటూ టీడీపీ ఎన్ఆర్ఐ కో-ఆర్డినేటరు, తెలుగు యువత జీడీనెల్లూరు నియోజకవర్గ అధ్యక్షుడు గురుసాల కిషన్‌చంద్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉద్యోగాలు, ఉపాధి లేక యువత ఎదుర్కొంటున్న సమస్యలను ఆ ఫిర్యాదులో పేర్కొని.. తమకు న్యాయం చేయాలని పోలీసులను కోరారు. ఆయనతో పాటు టీడీపీ వాణిజ్య విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు బట్టే చాణిక్యప్రతాప్, బీసీ సెల్ ఉపాధ్యక్షుడు శివరాం యాదవ్, నాయకులు రాజశేఖర్‌వర్మ, వెంకటరమణారెడ్డి, మునిరాజారెడ్డి, నాగరాజు, రామచంద్ర ఉన్నారు.



అంగన్వాడీలకు షోకాజ్ నోటీసులు

- తీసుకోకపోవడంతో కేంద్రాలకు అతికించిన అధికారులు
- 30వ రోజున పిల్లల తల్లుల మద్దతు

చిత్తూరు, జనవరి 10: సమ్మెలో ఉన్న అంగన్వాడీలకు బుధవారం అధికారులు షోకాజ్ నోటీసులు ఇవ్వగా.. వీరు తీసుకోలేదు. అంగన్వాడీలపై ప్రభుత్వం ఎస్మాను ప్రయోగించింది. ఈనెల 19వ తేదిలోపు విధుల్లో చేరకపోతే తొలగిస్తామని షోకాజ్ నోటీసులో పేర్కొంది. సమ్మెలో ఉండటం వల్ల 30 రోజులుగా గర్భిణులు, బాలింతలు, ఆరేళ్లలోపు పిల్లలకు పోషకాహారం అందడం లేదని ఆ నోటీసుల్లో ప్రస్తావించారు. దీంతో వారంతా ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. దైనందిన కార్యక్రమాలన్నీ ఆగిపోయినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీ వర్కర్లకు షోకాజ్ నోటీసులు ఇచ్చేందుకు జిల్లా స్త్రీ-శిశు సంక్షేమశాఖ అధికారులు సిద్ధం చేసి సచివాలయ సిబ్బందికి అందించారు. వారంతా ఆయా కేంద్రాలకు వెళ్లి వర్కర్లకు ఇవ్వడానికి ప్రయత్నించగా వాళ్లెవరూ నోటీసులను తీసుకోలేదు. దాంతో చిత్తూరుతో పాటు మరికొన్ని చోట్ల కేంద్రాలకు షోకాజ్ నోటీసులను అంటించి వెళ్లిపోయారు. అంగన్వాడీ యూనియన్ ఆదేశాల మేరకు జిల్లాలో ఒక్క వర్కర్‌కూడా బుధవారం షోకాజ్ నోటీసును తీసుకోలేదని నేతలు తెలిపారు.

సమ్మెకు తల్లుల మద్దతు



కార్వేటినగరంలో అంగన్వాడీలకు మద్దతుగా నిరసనలో కూర్చున్న పిల్లల తల్లులు

కార్వేటినగరంలో బుధవారం పిల్లల తల్లులతో కలిసి అంగన్వాడీలు నిరసన తెలిపారు. వర్కర్లకు ప్రభుత్వం చేయాల్సిన పనులను చేసి పెడితే పిల్లలను కేంద్రాలకు పంపుతామని తల్లులు తెలిపారు. కలెక్టరేట్ వద్ద అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక రిలే నిరాహారదీక్ష ముగింపు దీక్ష జరిగింది. ఎస్మా చట్టాలను ప్రయోగించి భయపెడతామంటే సీఎం జగన్‌ను ఇంటికి పంపిస్తామని యూనియన్ నేతలు హెచ్చరించారు. పలమనేరులోని దీక్షాశిబిరంలో నిరసన కొనసాగించారు.

ఎన్నికల సమావేశం రేపటికి వాయిదా

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 10: చిత్తూరులోని జడ్పీ మీటింగ్ హాలులో గురువారం ఉదయం 10 గంటలకు ఎన్నికల ఏర్పాట్లపై జరగాల్సిన సమావేశాన్ని అనివార్య కారణాలతో శుక్రవారానికి వాయిదా వేసినట్లు డీఆర్వో రాజశేఖర్ తెలిపారు. త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కలెక్టర్ షన్మోహన్ అధ్యక్షతన పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాల కల్పనపై సమావేశం ఏర్పాటుచేశామన్నారు. ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, అన్ని ఇంజినీరింగ్ శాఖల ఈఈలు, డిప్యూటీ ఈఈలు, ఏఈలు, డీఈవో, సర్వశిక్షా అభియాన్ ప్రాజెక్టు ఆఫీసర్, ఇంజినీర్లు, ఎంపీడీవోలు, ఎంఈవోలు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సెక్టోరల్ ఆఫీసర్లు, స్పెషల్ ఆఫీసర్లు తదితరులు శుక్రవారంనాటి సమావేశానికి హాజరుకావాలని పేర్కొన్నారు.

పంట పొలాలపై ఏనుగుల విధ్వంసం



కల్లూరు, జనవరి 10: మండలంలోని రెడ్డివారిపల్లి పంచాయతీలో మంగళవారం రాత్రి పంటలను ఏనుగులు ధ్వంసం చేశాయి. పులిచెర్ల నుంచి మంగళంపేటకు వెళ్లే మార్గమధ్యలో ముప్పిరెడ్డిగారిపల్లెకు చెందిన శ్రీరాములురెడ్డి పొలంలోకి ప్రవేశించిన ఏనుగులు 20 అరటిచెట్లు, వేరుశనగ, తమలపాకు తోటను ధ్వంసం చేశాయి. సమీపంలోని శీరాములుగౌడుకు చెందిన 40 అరటి, 30 బొప్పాయి, 10 సపోటా చెట్లను ధ్వంసం చేసిన ఏనుగులు బోరు మోటర్‌ను విరిచేశాయి. చిన్నబ్బకు చెందిన 10 కొబ్బరిచెట్లను ధ్వంసం చేశాయి. చిచ్చిలివారిపల్లిలోని ఉమామహేశ్వర్‌రెడ్డికి చెందిన 5 కొబ్బరిచెట్లు, వరినారు, డ్రిప్‌పైపులను ఏనుగులు ధ్వంసం చేశాయి. బాబురెడ్డికి చెందిన చెరకుతోటను, డ్రిప్ పైపులను ఏనుగులు ధ్వంసం చేశాయి.

పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలు అప్‌లోడ్ చేయండి

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 10: గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి ఈనెలాఖరులోగా ఈ గ్రామ సర్వర్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని జడ్పీ సీఈవో ప్రభాకర్ రెడ్డి సూచించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి పంచాయతీ, మండల పరిషత్ అభివృద్ధి ప్రణాళికల తయారీపై జడ్పీ మీటింగ్ హాలులో జరిగిన రెండురోజుల శిక్షణ తరగతుల ముగింపు సమావేశం బుధవారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ 17 సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించడానికి ప్రస్తుతం అందుబాటులో ఉన్న పథకాల నిధుల లభ్యత అంచనా వేయాలన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులను వినియోగించుకుని పెండింగ్ బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డీపీవో లక్ష్మి సూచించారు. జిల్లా వనరుల కేంద్ర సమన్వయకర్త షణ్ముగరామ్, పలమనేరు డీఎల్డీవో ఉమావాణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బ్లాస్టింగ్‌తో ఇంటిపై పడిన రాళ్లు

- హైవే అధికారుల నిర్లక్ష్యంతో పగుళ్లిచ్చిన గోడలు



పగుళ్లు ఇచ్చిన ఇంటి గోడలు

గుడిపాల, జనవరి 10: గుడిపాల మండలం పసుమంద కాలనీలో బుధవారం రాత్రి రోడ్డు పనుల విస్తరణలో భాగంగా రాళ్లు పగలకొట్టడానికి బ్లాస్టింగ్ చేశారు. ఈ పేలుడితో రాళ్లు సమీపంలోని ఇంటిపై పడటంతో.. ఆ ఇంటి గోడకు పగుళ్లు ఏర్పడ్డాయి. ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. హైవే అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఇలా జరిగిందని, గతంలోనూ రెండుసార్లు ఇలాగే జరిగిందని గ్రామానికి చెందిన వినాయక బుధవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్ఐ రామ్మోహన్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటిలోగా రీసర్వే పనులు పూర్తిచేయాలి

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 10: మూడో విడత రీసర్వే పనులు సచివాలయ సర్వేయర్లు, తహసీల్దార్లు గురువారంలోగా పూర్తిచేయాలని జేసీ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం సాయంత్రం సీసీఎల్ఏ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి జి. సాయిప్రసాద్ అమరావతి నుంచి అన్ని జిల్లాల జేసీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. చిత్తూరు నుంచి పాల్గొన్న జేసీ మాట్లాడుతూ మూడో విడత సర్వే 106 గ్రామాల్లో జరుగుతున్నట్లు వివరించారు. 10,048 సర్వేరాళ్ల కోసం ప్రతిపాదనలు పంపగా, ఇప్పటివరకు 60,583 సర్వేరాళ్లు అందాయని, వాటిలో ఐదువేల సర్వేరాళ్లు నాటడం జరిగిందన్నారు. కోర్టు వివాద కేసులు లేని ప్రాంతాల్లో పట్టాల పంపిణీ కార్యక్రమం చేపడతామన్నారు. డీఆర్వో రాజశేఖర్, సర్వేశాఖ ఏడీ గౌస్ అహ్మద్, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు మురళి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నీటి బిల్లులు ఇస్తారా.. చావమంటారా?

ప్రభుత్వంపై వైసీపీ నేతలు, ప్రజాప్రతినిధుల ఆగ్రహం ● కార్యకర్తల సమావేశాన్ని బహిష్కరించి నిరసన

శాంతిపురం, జనవరి 10: 'నీటి బిల్లులు ఇస్తారా. మమ్మల్ని చావమంటారా. ఎన్నేళ్లు ఈ అవస్థలు. ఎందుకు మా పై ఇంత కక్ష అంటూ ప్రభుత్వంపై వైసీపీ నేతలు, సర్పంచులు, మాజీ ఎంపీటీసీ సభ్యులు ఆగ్రహం వ్యక్తంచేశారు. శాంతిపురం మండలం చౌడంపల్లె క్రాస్‌లోని కూరగాయల గ్రేడింగ్ యూనిట్ కేంద్రంలో బుధవారం వైసీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆ పార్టీకి చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు, మాజీ ఎంపీటీసీలు, నేతలు హాజరయ్యారు. ఎంపీ రెడ్డప్ప, ఎమ్మెల్సీ భరత్ సమావేశానికి రాగానే.. వీరతా తొలుత నీటి బిల్లుల గురించి ప్రస్తావించారు. ఆ తర్వాత మాట్లాడదామని వారు చెప్పడంతో.. వీరంతా సమావేశాన్ని బహిష్కరించారు. బయటకు వచ్చి ప్లకార్డులతో నిరసన తెలిపారు. వైసీపీ అధికారంలోకి రాగానే.. ప్రజల దాహం తీర్చాలని పదేపదే చెబుతుంటే సొంత డబ్బు ఖర్చు చేసి నీటి సరఫరా చేశామన్నారు. ఆ బిల్లులను ఇప్పటికీ ఇవ్వకపోవడం ఎంతవరకు న్యాయమని వారు ప్రశ్నించారు. అప్పు చేసిన డబ్బుకు వడ్డీ కట్టలేక ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చిందన్నారు. ముఖ్య నేతలకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదన్నారు. ధర్నాలు, నిరసనలు చేసినా ఫలితం లేకుండా పోయిందని మండిపడ్డారు. కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు సుమారు. రూ.17 కోట్ల బకాయి ఉండగా.. అందులో రూ.9.25 కోట్లు శాంతిపురం మండలానికే రావాల్సి ఉందన్నారు. అప్పులకు వడ్డీలు కట్టలేక చాలామంది అజ్ఞాతంలోకి వెళ్లారని ఆవేదన వ్యక్తంచేశారు. వీరి వద్దకు ఎంపీ, ఎమ్మెల్సీ వచ్చి.. ఇప్పుడు సమయం కాదని, నీటి బిల్లలు ఇప్పించే బాధ్యత తమదని చెప్పినా వారు వినలేదు. చివరకు అమరావతి వెళ్లేందుకు ముఖ్యమైన నాయకులకు ఎమ్మెల్సీ బస్సు టికెట్లు బుక్ చేశారు. తాను గురువారం ఉదయం సచివాలయంలో కలస్తానని, మీరతా బస్సులో అక్కడికి వస్తే అధికారులతో మాట్లాడతామని చెప్పారు. అవసరమైతే సీఎం జగన్ వద్దకే తీసుకెళ్లి బిల్లులు ఇప్పిస్తామని హామీ ఇవ్వడంతో వీరు సమావేశానికి వెళ్లారు. నిరసన తెలిపిన వారిలో చెంగుబల్ల సర్పంచ్ భర్త భాస్కర్, ఎంకేపురం సర్పంచి భర్త మోహన్, ఎంపీటీసీ రాజప్ప, జగదీష్, మాజీ ఎంపీటీసీ రామకృష్ణారెడ్డి, మాజీ మండల వైసీపీ యువత అధ్యక్షుడు విజయకుమార్, లోకేష్‌రెడ్డి, మునస్వామి, శంకర్, మణి, రమణ, భాస్కర్, అబ్దుల్ పాల్గొన్నారు.



సమావేశాన్ని బహిష్కరించి నిరసన తెలుపుతున్న వైసీపీ నేతలు, ఇతర ప్రజాప్రతినిధులు

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

వయోవృద్ధులు హక్కులు వినియోగించుకునేలా కృషిచేయాలి


మాట్లాడుతున్న జడ్జి కరుణకుమార్

చిత్తూరు, జనవరి 10: వయోవృద్ధులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను వారు సద్వినియోగం చేసుకునేలా సంబంధిత శాఖల అధికారులు కృషిచేయాలని జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఐ. కరుణకుమార్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక డీఆర్డీఏ శిక్షణా కేంద్రంలో జిల్లా గ్రామీణాభివృద్ధి, సాంఘిక సంక్షేమ, స్త్రీశిశు సంక్షేమ, వయోవృద్ధుల విభిన్న సంక్షేమ అధికారులు, డీఆర్డీఏ పీడీ తులసి, సాంఘిక సంక్షేమశాఖ అధికారిణి రాజ్యలక్ష్మితో కలిసి వయోవృద్ధుల సంక్షేమ, సమస్యలపై సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కరుణకుమార్ మాట్లాడుతూ వయోవృద్ధుల ఆశ్రమాల్లోని వృద్ధులకు రేషన్‌కార్డు, ఓటరు గుర్తింపు కార్డు, ఆధార్ కార్డులు, పెన్షన్లు అందించాలని కోరారు. అపోలో ఆస్పత్రి యాజమాన్యం విశ్రాంత ఉద్యోగులకు వైద్య సౌకర్యాలు కల్పించాలని సూచించారు. వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

గుండె వ్యాధి చికిత్సకు రూ.లక్ష విరాళం



చిత్తూరు సిటీ, జనవరి 10: గుండెవ్యాధి చికిత్సకు జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ ఛైర్మన్, టీడీపీ నేత గురజాల జగన్మోహన్ రూ.లక్ష విరాళం ఇచ్చారు. నగరంలోని శంకరయ్యగుంటకు చెందిన టీడీపీ మాజీ కౌన్సిలర్ మురళి కోడలు మీనాక్షి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. ఆమె కుటుంబ సభ్యుల అభ్యర్థన మేరకు చికిత్సకోసం ఆర్థిక సాయాన్ని అందించారు. గురువారం స్థానిక లక్ష్మీనగర్ కాలనీలో జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ కార్యాలయంలో మీనాక్షి కుటుంబ సభ్యులకు గురజాల జగన్మోహన్ రూ.లక్ష ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా మీనాక్షి కుటుంబ సభ్యులు గురజాల జగన్మోహన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సామాజిక న్యాయంలో యువత భాగస్వాములు కావాలి

చిత్తూరు (సెంట్రల్), జనవరి 10: భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ సూచించిన సామాజిక న్యాయంలో యువత భాగస్వాములు కావాలని ఇంటర్మీడియట్ డీవీఈవో సయ్యద్ మౌల పేర్కొన్నారు. జన్‌భగీదారి కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ అబ్దుల్ మజీద్, అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షురాలు హేమలత అధ్యక్షతన ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు సమావేశం నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఆర్వో చిట్టిబాబు, అధ్యాపకులు, ఎన్ఎన్ఎస్ క్యాడెట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంతకాల సేకరణ

వెదురుకుప్పం, జనవరి 10: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహా శిల్పం సంతకాల సేకరణ కార్యక్రమాన్ని మండలంలోని బొమ్మయ్యపల్లె సచివాలయం పరిధిలో చేపట్టారు. ఈ క్రమంలో అంబేడ్కర్ నిర్దేశించిన సామాజిక న్యాయ మార్గంలో నడుస్తానని ప్రతిజ్ఞ చేస్తున్నానని సంతకాలు చేశారు. సర్పంచ్ చొక్కా గోవిందయ్య, ఎంపీటీసీ కొత్తపల్లి భాస్కర్ నాయకులతో కలసి దేవళంపేటలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

నేడే అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 10: సామాజిక సమతా సంకల్ప్ (జన్‌భగీదారి) కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం దర్గా సర్కిల్ వద్ద వున్న స్థానిక డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించే కార్యక్రమం జరుగుతుందని జేసీ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ షన్మోహన్, ప్రజాప్రతినిధులు పాల్గొని ప్రతిజ్ఞ చేస్తారన్నారు. ఇందులో ఎస్సీ ఎస్టీ సంఘాల నాయకులు, విద్యార్థులు హెచ్చు సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమం గురువారం నుంచి ఈనెల 19వ తేదీ వరకు జరుగుతాయని చెప్పారు.

12న రక్తదాన శిబిరాలు

సామాజిక సమత సంకల్ప్‌లో భాగంగా ఈనెల 12న చిత్తూరు ప్రధాన ఆస్పత్రితో పాటు పలమనేరు సీహెచ్‌సీలో, నగరి సీహెచ్‌సీలో, కుప్పం పీఈఎస్ మెడికల్ కాలేజీలో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జేసీ వివరించారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే రక్తదాన శిబిరాల్లో యువతీ యువకులు స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు. రక్తదానం చేసేవారు స్థానిక ఆర్డీవో కార్యాలయాల్లో ముందస్తుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

సీఎంని కల్సిన భూపేష్ గోపీనాథ్



చిత్తూరు, జనవరి 10: మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ దివంగత గోపీనాథ్ తనయుడు భూపేష్ గోపీనాథ్ బుధవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని రాజంపేట ఎంపీ మిధున్‌రెడ్డి సమక్షంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

ముందస్తు సంక్రాంతి వేడుకలు

కార్వేటినగరం, జనవరి 10: కార్వేటినగరం శ్రీలక్ష్మీ నరసింహ విద్యా సంస్థల ఆధ్వర్యంలో బుధవారం ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు భోగి మంటలు వేసి సంప్రదాయ సంక్రాంతి పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. విద్యాసంస్థల నిర్వాహకులు దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం

ఐరాల(కాణిపాకం), జనవరి 10 కాణిపాక క్షేత్రంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి తిరుపతికి చెందిన సుబ్రహ్మణ్యం నాయుడు రూ.1,00,116 బుధవారం విరాళంగా అందించారు. విరాళదాతకు సూపరింటెండెంట్ కోదండపాణి ఆలయ మర్యాదలతో స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

బంగారుపాళ్యం, జనవరి 10: మండలంలోని మంగళపల్లి పంచాయతీ కుప్పాలపల్లి గ్రామంలో రాష్ట్ర సర్పంచ్‌ల సంఘ కార్యదర్శి కుప్పాల మురళి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. తిరుపతిలోని రమాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులచే పేదలకు వైద్యం అందించారు. 192 మందికి వైద్యపరీక్షలు నిర్వహించగా, వారిలో 20కి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వారికి తిరుపతిలోని రమాదేవి ఆస్పత్రిలో చికిత్స అందించనున్నట్లు తెలిపారు. శిబిరానికి విచ్చేసిన రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వేదతేజ, డాక్టర్ కుప్పాల కీర్తి, డాక్టర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

పింఛన్ దారులకు లైఫ్ సర్టిఫికెట్ల పంపిణీ

కార్వేటినగరం, జనవరి 10: కార్వేటినగరం పెన్షన్ దారుల సంఘం భవనంలో సహృదయ సేవా సమితి ఆధ్వర్యంలో 70 మంది పింఛన్ దారులకు ఉచితంగా లైఫ్ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. గత రెండేళ్లుగా పెన్షన్ దారులకు ఉచితంగా లైఫ్ సర్టిఫికెట్లను పంపిణీ చేస్తున్నట్లు నిర్వాహకులు డైట్ లెక్చరర్ చెంగల్‌రాజు తెలిపారు. కార్యక్రమంలో పెన్షన్ దారుల సంఘం అధ్యక్షులు మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చెంగమ్మ, కోశాధికారి విజయకుమార్ పిళ్లై పాల్గొన్నారు.

32వ రోజు అన్నదానం

బంగారుపాళ్యం, జనవరి 10: మండల కేంద్రంలోని బీపీఎన్‌కే కాంప్లెక్స్ వద్ద అన్నాక్యాంటీన్‌లో బుధవారం సదకుప్పం గ్రామానికి చెందిన బాలకృష్ణ కుటుంబ సభ్యులు భోజనం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మురళీమోహన్, మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ నాయుడు, నాయకులు రామభద్ర నాయుడు, జనార్ధన్ గౌడ్, హేమచంద్ర నాయుడు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన


అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న మున్సిపల్ అవుట్ సోర్సింగ్ కార్మికులు

చిత్తూరు, జనవరి 10: న్యాయమైన కోర్కెలను తీర్చాలని నగరపాలక కార్యాలయం వద్ద పారిశుధ్య, ఇంజనీరింగ్ విభాగం అవుట్ సోర్సింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారంతో ఎనిమిదవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కార్మికులు అర్ధనగ్నంగా నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షులు నాగరాజన్, ఇంజనీరింగ్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి రామమూర్తి మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం మొండివైఖరిని అవలంభిస్తోందని తీవ్రంగా విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో జగన్ ప్రభుత్వం ఇంటికి పోవడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపీనాథ్, మణి, దాసరి చంద్ర, వాసు, జయశంకర్, సురేష్, వినాయక, శరవణ, వెంకటేశ్, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలి

చిత్తూరు, జనవరి 10: అంగన్వాడీల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ వద్ద జరుగుతున్న నిరవధిక రిలే దీక్ష బుధవారం 30వ రోజుకు చేరింది. ఈ ధర్నానుద్దేశించి సీఐటీయూ జిల్లా గౌరవాధ్యక్షులు వాడ గంగరాజు, అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు లలిత మాట్లాడుతూ సమస్యల పరిష్కారంకోసం అంగన్వాడీలు వీరోచితంగా పోరాటం చేస్తున్నారని, ఈ పోరాటాన్ని అణచివేయడానికి ప్రభుత్వం నోటీసులిచ్చి భయభ్రాంతులకు గురిచేస్తోందని విమర్శించారు. అంగన్వాడీలకు ఎస్మా చట్టం వర్తించదని చెబుతున్నప్పటికీ జీవో నెంబరు 2ను తీసుకొచ్చి భయపెడుతున్నారన్నారు. కేవలం వెయ్యి రూపాయలు మాత్రమే పెంచి అన్ని చేసేశామని ప్రభుత్వం చెప్పడం భావ్యం కాదన్నారు. కలెక్టరేట్ వద్ద అంగన్వాడీ దీక్షకు యూటీఎఫ్ మద్దతు పలికింది. అంగన్వాడీ ల సమస్యలు పరిష్కారమయ్యే వరకు యూటీఎఫ్ అండగా ఉంటుందన్నారు. యూటీఎఫ్ నుంచి మద్దతు ఇచ్చిన వారిలో రెడ్డప్ప నాయుడు, పార్థసారథి, శేఖర్ పాల్గొన్నారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు సుజని, మమత, కుప్పం ప్రాజెక్టు నాయకులు సరళ, భారతి, తదితరులు పాల్గొన్నారు.

పిల్లల తల్లులతో కలసి నిరసన

కార్వేటినగరం, జనవరి 10: కార్వేటినగరం ఎంపీడీవో కార్యాలయం వద్ద అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లల తల్లులతో కలిసి అంగన్వాడీలు బుధవారం నిరసన తెలిపారు. అంగన్వాడీల న్యాయబద్ధమైన సమస్యలు పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని అంగన్వాడీ పిల్లల తల్లులు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కార్వేటినగరం మండల పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎంసీఏ థర్డ్ సెమిస్టర్‌లో విజయం విద్యార్థుల ప్రతిభ


సరస్వతి, హరిప్రసాద్, ఉమ మహేశ్వరి, జ్యోతిశ్వరి, మహతి

చిత్తూరు (సెంట్రల్), జనవరి 10: ఎస్వీయూ విడుదల చేసిన ఎంసీఏ థర్డ్ సెమిస్టర్ ఫలితాల్లో స్థానిక విజయం బిజినెస్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపి ఉత్తమ జీపీఏ సాధించినట్లు ఆ సంస్థ అధినేత తేజోమూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్.సరస్వతి (8.31 జీపీఏ), హరిప్రసాద్ (8.25), పి.ఉమ మహేశ్వరి (8.24), బి.జ్యోతిశ్వరి, ఎం.మహతి (8.19) జీపీఏ సాధించారు. పరీక్షలకు హాజరైన వారిలో 87.25 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. వీరిని అకడమిక్ డైరెక్టర్ శైలజా మూర్తి, ప్రిన్సిపాల్ జయంతి, అధ్యాపకులు శ్రీనివాస్, రఘురాం, దినకర్, కవిత, చంద్రమౌళిలు అభినందించారు.

స్కిల్ ఏపీతో వేము ఇంజనీరింగ్ కళాశాల ఎంవోయూ


ఒప్పంద పత్రాలను అందజేస్తున్న నవీన్ కిలారి

పూతలపట్టు, జనవరి 10: ఇంజనీరింగ్ చదువుకుంటున్న విద్యార్థినీ విద్యార్థులు నైపుణ్యాభివృద్ధి పెంపొందించుకునేందుకు అవసరమైన శిక్షణ ఇచ్చి వారికి మంచి కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు వేము ఇంజనీరింగ్ కళాశాల, డీఏడీబీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్తంగా రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (స్కిల్ ఏపీ)తో ఎంవోయూ ఒప్పందం కుదుర్చుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నవీన్ కిలారి ఒక ప్రకటనలో తెలిపారు. జర్మనీ అకాడమీ ఆఫ్ డిజిటల్ ఎడ్యుకేషన్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. రీసోర్స్‌పర్సన్లుగా సయ్యద్ ఇస్మాయిల్, ఎన్. ప్రత్యూష వ్యవహరిస్తారని, ఆసక్తిగల విద్యార్థులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

ఎన్నిరెట్లు పరిహారం ఇచ్చినా మేం భూమి ఇవ్వము

● రైతుల నిరసన


సచివాలయం వద్ద రైతుల నినాదాలు

గుడిపాల, జనవరి 10: ఎన్నిరెట్లు నష్టపరిహారం కల్పించినా మేము భూమి ఇవ్వమని రైతులు తమ నిరసనతో ఆవేదన వ్యక్తం చేసిన సంఘటన బసవాపల్లి గ్రామ సచివాలయంలో చోటుచేసుకుంది. బుధవారం ఎన్‌హెచ్ఎస్ఆర్సీఎల్ అధికారులు బుల్లెట్ ట్రైన్ లైన్ ఏర్పాటు చేయడానికి రైతుల నుంచి తగిన భూముల వివరాలను సేకరించడానికి గాను రైతులతో సమావేశం నిర్వహించారు. ఇప్పుడున్న మార్కెట్ విలువ కన్నా ఐదు రెట్లు ఎక్కువ ఇస్తామని, మీ ఆధార్, సర్వే నెంబర్ల పూర్తి వివరాలు తమకు తెలియజేయాలని ఎన్‌హెచ్ఎస్ఆర్సీఎల్ అధికారులు వివరించారు. దీంతో బసవాపల్లి రెవిన్యూ గ్రామానికి చెందిన రైతులు ఒక్కసారిగా ఆగ్రహంతో.. మీకు భూములిచ్చేసి మేము ఎక్కడికెళ్లాలని, మా బతుకుతులు ఏమైపోవాలని, ఇదివరకే సూపర్‌ఫాస్ట్ ఆరులైన్ల కోసం భూములిచ్చి నష్టపోయామన్నారు. మా దగ్గరనుంచి బలవంతంగా భూసేకరణ చేసినట్లయితే మండల కేంద్రంలో ధర్నా చేపడతామని హెచ్చరించారు. దీంతో స్పందించిన ఎన్‌హెచ్ఎస్సీఎల్ అధికారులు మీ డిమాండ్లను పై అధికారుల దృష్టికి తీసుకెళతామని చెప్పడంతో రైతులు చల్లబడ్డారు.

కేంద్రం నిధులతో వైసీపీ ప్రభుత్వం ప్రచారం

● జిల్లా బీజేపీ కిసాన్‌మోర్చా అధ్యక్షుడు చంద్రశేఖర్ నాయుడు

గంగాధరనెల్లూరు, జనవరి 10: కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తుంటే... రాష్ట్రంలో అధికార వైసీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలపై వైఎస్సార్, సీఎం జగన్‌ల బొమ్మలను వేసుకుని ప్రచారం చేసుకుంటోందని జిల్లా బీజేపీ కిసాన్‌మోర్చా అధ్యక్షుడు జాగర్లమూడి చంద్రశేఖర్ నాయుడు ధ్వజమెత్తారు. గంగాధరనెల్లూరు మండలం పాతపాళ్యం పంచాయతీ మిట్టకొత్తూరులో సర్పంచ్ యర్రగుంట్ల కృష్ణమ నాయుడు అధ్యక్షతన బుధవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రచారవ్యాన్ నుంచి డిజిటల్ స్క్రీన్‌పై కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రదర్శించి, ప్రజలకు అవగాహన కల్పించారు. విద్యార్థినులు దేశభక్తి పాటలకు నృత్యాలుచేసి అలరించారు. ఈకార్యక్రమంలో ఈవోపీఆర్డీ రాఘవేంద్రరాజు, జిల్లా బీజేపీ ఎస్సీమోర్చా ప్రధానకార్యదర్శి సుందరరాజు, హౌసింగ్ వర్క్‌ఇన్స్‌పెక్టర్ గీత, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చేప పిల్లలు వదిలారు

నింద్ర, జనవరి 10: మండల కేంద్రమైన నింద్రలోని పెద్ద చెరువులో బుధవారం ఉచిత చేపలను వదిలే కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ దీప మాట్లాడుతూ మత్స్య సహకార సంఘం పరిధిలో ఉన్న చెరువులలో ఉచితంగా 42వేల చేపపిల్లలను వదిలినట్లు తెలిపారు. మత్స్య అభివృద్ధి అధికారి రామ్ కుమార్, గ్రామ మత్స్య అధికారి మైఖేల్, సంఘం ఛైర్మన్ శివలింగారెడి పాల్గొన్నారు.

మహిళ మెడలో చైన్ చోరీ


దుండగులచే సగం తెంపేసిన చైను

గుడిపాల, జనవరి 10: మండలంలోని కుప్పిగానిపల్లెలో బుధవారం ఓ ఇంట్లో మహిళ మెడలో ఉన్న చైన్‌ను లాక్కొని పరారైన సంఘటన చోటుచేసుకుంది. రాణెమ్మ కథనం మేరకు ఇంటి వద్దకు వచ్చి తలుపు తడితే ఎవరని చూడగా, గుర్తుతెలియని వ్యక్తి వచ్చి మెడలో వున్న చైన్‌ను లాగడానికి ప్రయత్నించాడని, గట్టిగా పట్టుకోవడంతో తెంపుకుని వెళ్లిపోయాడని ఆవేదన వ్యక్తం చేశారు. తెంపుకువెళ్లిన బంగారు చైను నాలుగు సవరాలు ఉందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. గుడిపాల పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాటుసారా స్వాధీనం: ఒకరి అరెస్టు

బంగారుపాళ్యం, జనవరి 10: మండలంలోని రాగిమానిపెంట, గాంధీనగర్‌లో బుధవారం ఎస్ఈబీ అధికారులు బుధవారం విస్తృతంగా దాడులు నిర్వహించారు. రాగిమానిపెంట గ్రామానికి చెందిన చెంగల్రాయన్‌ను అదుపులోకి తీసుకుని, అతడివద్ద 10 లీటర్ల నాటుసారాను స్వాధీనపరచుకుని, కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ మోహన్ బాబు, హెడ్‌కానిస్టేబుల్ కృష్ణయ్య, సుబ్రహ్మణ్యం గౌడ్, నాగరాజ్, వెంకటేష్, కృష్ణవేణి ఉన్నారు.

అంగన్వాడీలకు షోకాజ్ నోటీసులు

వెదురుకుప్పం, జనవరి 10: గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని కార్వేటినగరం ఐసీడీఎస్ పరిధిలో ఉన్న వెదురుకుప్పం, ఎస్ఆర్‌పురం, కార్వేటినగరం మండలాల్లో సమ్మెలో పాల్గొంటున్న 222 మంది అంగన్వాడీలకు సీడీపీవో పద్మసునంద బుధవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ విషయమై సీడీపీవో మాట్లాడుతూ ప్రాజెక్టు పరిధిలో 222 మందికి షోకాజ్ నోటీసులు ఇచ్చామని, ఇందులో 98 మంది మెయిన్ అంగన్వాడీ కార్యకర్తలు, 25 మంది మినీ అంగన్వాడీ వర్కర్లు, 99 మంది హెల్పర్ల(సహాయకులు)కు ఇచ్చామని తెలిపారు.

'ఆడుదాం ఆంధ్రా'లో గాయపడ్డ పీఈటీ


గాయపడ్డ పీఈటీని పరామర్శిస్తున్న జడ్పీ సీఈవో

యాదమరి, జనవరి 10: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో ఓ పీఈటీ గాయపడ్డారు. బుధవారం మండలంలోని 14 కండ్రిగ ముస్లింవాడలో ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి కబడ్డీ పోటీలు జరిగాయి. కబడ్డీ ఆడుతూ క్రీడాకారులు పీఈటీ మాధవిపై పడ్డారు. దీంతో పీఈటీ కాలుకు గాయమైంది. వెంటనే చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న జడ్పీ సీఈవో ప్రభాకర్ రెడ్డి, డీఈవో విజయేంద్రరావు, డీఎల్‌డీవో రవికుమార్, డీఎస్‌డీవో బాలాజీలు వెంటనే పీఈటీని పరామర్శించారు.

పాలసముద్రం: పాలసముద్రం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో పాలసముద్రం సచివాలయం క్రీడాకారులు గెలుపొందినట్లు ఎంపీడీవో రామనాథ రెడ్డి పేర్కొన్నారు.

విజయపురం: మండలంలోని పన్నూరు సబ్‌స్టేషన్‌లో క్రికెట్ పోటీలు నిర్వహించారు. గురువారం మండల స్థాయిలో టీంలను ఎంపిక చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రమౌళి, ఎంఈవో ఆంజనేయులు, సర్పంచ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తవణంపల్లె: మండలంలోని అరగొండ బాలుర పాఠశాల, టోటల్ హెల్త్, తవణంపల్లె, చెర్లోపల్లెలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను నిర్వహించారు. ఈపోటీల్లో వాలీబాల్-9, బాడ్మింటన్-9, క్రికెట్-12 టీమ్‌లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో తహసీల్దార్ గుణశేఖర్‌రెడ్డి, ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్, మండల ప్రత్యేకాధికారి గోవర్ధన్ పాల్గొన్నారు.

పూతలపట్టు: పూతలపట్టు ఉన్నత పాఠశాల ఆవరణలో వాలీబాల్ పోటీలను ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించారు. ఈ పోటీల్లో 16 టీములు మండలస్థాయిలో తలపడగా... ఎం.బండపల్లి ప్రథమ, పోటుకనుమ ద్వితీయ, పి. కొత్తకోట తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. వీరికి ఈనెల 25తేదీన బహుమతులు అందజేయనున్నారు. ఎంపీడీవో గౌరి, తహసీల్దార్ విజయ్‌భాస్కర్, జడ్పీసీఈవో ప్రభాకర్‌రెడ్డి, వైసీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

కార్వేటినగరం: కార్వేటినగరం ప్రభుత్వహైస్కూల్‌లో మండల స్థాయి ఆటల పోటీలను ఎంపీడీవో మోహన్‌మురళీ ప్రారంభించారు. మండలంలోని వివిధ గ్రామ సచివాలయాల పరిధిలో గెలుపొందిన విజేతలకు మండల స్థాయిలో ఆటల పోటీలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

నింద్ర: మండల స్థాయిలో ఆడుదాం ఆంధ్రా క్రీడలను బుధవారం మండల కేంద్రమైన నింద్రలో ఎంపీపీ దీప ప్రారంభించారు. కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ వంటి క్రీడల్లో విద్యార్థులు, యువత పాల్గొన్నారు. మండల ప్రత్యేకాధికారి సతీష్‌కుమార్, ఎంపీడీవో అరుణ, ఆర్‌బీకే ఛైర్మన్ వీరయ్య, వైస్ ఎంపీపీ శుభా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: బంగారుపాళ్యం ప్రభుత్వ కళాశాల మైదానంలో మండలస్థాయిలో కబడ్డీ, వాలీబాల్, క్రికెట్, బాల్‌బ్యాడ్మింటన్ పోటీలను ఎంపీపీ అమరావతి ప్రారంభించారు. వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి, ఎంపీడీవో హరిప్రసాద్ రెడ్డి, ఎంఈవో నాగేశ్వరరావు, నేతలు పాల్గొన్నారు.

డీఎస్సీ వెంటనే నిర్వహించాలి: ఆపస్


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి బొత్స

చిత్తూరు (సెంట్రల్), జనవరి 10: రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న వేలాది ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయడానికి వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని ఆపస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాలాజీ, సత్యనారాయణలు గురువారం విజయవాడలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు విజ్ఞప్తి చేశారు. ఆపస్ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ అనంతరం పలు అంశాలపై మంత్రితో చర్చించారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్, రఘునాథ్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చెరువులోకి షుగర్ ఫ్యాక్టరీ వ్యర్థపు నీరు

● గ్రామస్తుల నిరసన


నిరసన తెలుపుతున్న ఐడీపట్టడీ గ్రామస్తులు

శ్రీరంగరాజపురం, జనవరి 10: ఎస్ఆర్‌పురం మండలం నెలవాయి గ్రామ పంచాయతీ, సొనకుప్పం వద్ద ఉన్న ఎస్ఎన్‌జే షుగర్ ఫ్యాక్టరీ వ్యర్థపు నీరు చెరువులోకి వస్తుందని సమీపంలో ఉన్న తమిళనాడు రాష్ట్రంలోని ఐడీపట్టడీ గ్రామస్తులు బుధవారం షుగర్ ఫ్యాక్టరీ గేటు వద్ద నిరసన తెలిపి, చెరకు లారీలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఐడీపట్టడీ గ్రామ సమీపంలో ఉన్న చెరువులోకి ఫ్యాక్టరీ వ్యర్థపు నీరు వస్తుందని, ఈ చెరువులోని నీరు తాగిన ఆవులు చనిపోతున్నాయని, ఇప్పటి వరకు సుమారు 30 ఆవులు, 20 దూడలు చనిపోయాని గ్రామస్తులు వాపోయారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడ చేరుకుని గ్రామస్తులతో, ఫ్యాక్టరీ యాజమాన్యంతో మాట్లాడారు. ఇకపై ఎప్పుడూ వ్యర్థాలు వదలమని ఫ్యాక్టరీ యాజమాన్యం చెప్పడంతో, గ్రామస్తులు అక్కడ నుంచి వెళ్లిపోయారు.

టీడీపీ అధికారంలోకి వస్తేనే సమస్యల పరిష్కారం

గంగాధరనెల్లూరు, జనవరి 10: రానున్న ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే అన్నివర్గాల ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయని జిల్లా టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి యర్రగుంట్ల కృష్ణమనాయుడు అన్నారు. బాబుష్యూరిటీ... భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా గంగాధరనెల్లూరు మండలం వరత్తూరు పంచాయతీ నరాలకండ్రిగలో బుధవారం టీడీపీనేతలు ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంచిపెట్టారు. మండల టీడీపీ బీసీసెల్ అధ్యక్షుడు బుర్రా జ్యోతియాదవ్, నేతలు తులసిరెడ్డి, రూపేంద్రరెడ్డి, భాస్కర్‌రెడ్డి, శంకర్‌యాదవ్, జీవరత్నంయాదవ్, వెంకటేష్‌యాదవ్ పాల్గొన్నారు.

పాలసముద్రం: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో గంగాధరనెల్లూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి థామస్‌ను గెలిపించాలని మండల టీడీపీ అధికార ప్రతినిధి శేఖర్ రాజు కోరారు. మండలంలోని శ్రీకావేరిరాజుపురంలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు.

పారిశుధ్య పనులను పర్యవేక్షించిన కమిషనర్


కాలువను శుభ్రం చేస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు, జనవరి 10: నగరంలో పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణకు ప్రజలు సహకరించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నగర కమిషనర్ అరుణ పిలుపునిచ్చారు. మున్సిపల్ అవుట్‌సోర్సింగ్ కార్మికుల సమ్మె నేపథ్యంలో కమిషనర్ బుధవారం నగరంలో జరుగుతున్న పారిశుధ్య కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ 38వ వార్డులో ఏఎన్ఎం వీధిలో కార్పొరేటర్ ఉన్ని కృష్ణన్‌తో కలిసి కాలువల్లో పూడిక తీశారు. వీధులను శుభ్రం చేశారు. ఏసీ గోవర్ధన్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ చిన్నయ్య, మేస్త్రీలు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో రుద్రాభిషేకం

చిత్తూరు కల్చరల్, జనవరి 10: గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో మాస శివరాత్రి సందర్భంగా బుధవారం సాయిలింగేశ్వర స్వామికి భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో రుద్రాభిషేకం నిర్వహించారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు సత్యసాయి సేవాసమితి నిర్వాహకులు ఉచితంగా పూజాద్రవ్యాలను అందజేశారు. నగర కన్వీనర్ ఆర్. శేషనారాయణ, బి. పాండురంగం, ఆర్. సత్యనారాయణ, శ్రీకంఠయ్య పాల్గొన్నారు.

కిట్ల పంపిణీ

చిత్తూరు, జనవరి 10: నగరపాలక సంస్థ పరిధిలోని 43వ వార్డు సచివాలయాల్లో జరుగుతున్న జగనన్న సురక్ష-2 కార్యక్రమాలను బుధవారం నగర మేయర్ అముద పరిశీలించారు. రోగులకు కిట్లను, ప్రత్యేక ప్రతిభావంతులకు పెన్షన్లు పంపిణీ చేశారు. డీఎంహెచ్‌వో ప్రభావతితో కలిసి ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారు. 12వ డివిజన్‌లో జరుగుతున్న వైద్య శిబిరాన్ని డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. ఏసీ గోవర్ధన్, స్థానిక కార్పొరేటర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా నగరంలోని 39వ డివిజన్‌లో నిర్వహించిన జన్‌భగీదారి కార్యక్రమంలో మేయర్ పాల్గొని అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.